నవతెలంగాణ

ఆదిలాబాద్

1

గురువారం | ఫిబ్రవరి 08, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల, రూయ్యడి, తలమడుగు, డోర్లి, సుంకిడి, లాల్‌గడ, లక్ష్మింపూర్, కుచులాపూర్, ఉమ్డం గ్రామాలలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.7కోట్లతో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపిపి కల్యాణం లక్ష్మీరాజేశ్వర్, జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, కమలాకర్, ఎస్సి సెల్ అధ్యక్షుడు అశోక్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు రఫిక్, కాంగ్రెస్ నాయకులు రఘు, ప్రతాప్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ట్రైన్‌లో భారీ దొంగతనం

- లక్షల్లో దోచుకెళ్లిన దుండగులు
- మహారాష్ట్రలో బాధితుడి ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైలులో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ జిల్లా వాసులను మహారాష్ట్ర ప్రాంతాల్లో దొంగలు దోచుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జగదీష్ అగర్వాల్ తమ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నాసిక్‌లో ఓ శుభకార్యానికి వెళ్లారు. అయితే రైల్‌లో తిరుగు ప్రయాణంలో నాందేడ్ సమీపంలో మంగళవారం రాత్రి దొంగలు వారి బ్యాగుల్లో నుండి నగదు, విలువైన ఆభరణాలు, సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. సుమారు రూ.36 లక్షల మేర చోరీ జరిగినట్లు బాధితులు నాందేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలి

- 5, 6 షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణకు ఉద్యమం
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో గుర్తించిన నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలని, 5, 6 షెడ్యూల్ ప్రాంతాన్ని ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా షెడ్యూల్ ప్రాంత పరిరక్షణకై ఉద్యమం నిర్మిస్తామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. బుధవారం న్యూ ఢిల్లీలో జరిగిన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ సమావేశాల్లో ఆయన తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలని ఆనాటి రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న నరసింహన్ కమిటీ ఆధ్వర్యంలో గుర్తించిన గ్రామాలను ఏజెన్సీలో కలప కుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. నాన్ ఏజెన్సీలో ఉన్న గ్రామాల ప్రజలు షెడ్యూల్ హక్కులకు దూరంగా ఉండటం, వారికి షెడ్యూల్ ప్రాంతం ఫలాలను అందించడంలో విఫలమవుతున్నారని తెలిపారు. దేశంలోని 5, 6 గిరిజన షెడ్యూల్ ప్రాంతాన్ని ఎత్తివేసి కార్పొరేట్ కంపెనీలకు ఆ ప్రాంత సహజ వనరుల దోపిడీకు కుట్ర చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా షెడ్యూల్ ప్రాంత పరిరక్షణకై ఉద్యమం నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-వాంకిడి

ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించి సమయపాలన పాటించకుండా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల సముదాయం పరిధిలోని లింబుగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినందున ప్రత్యామ్నాయంగా నియమించిన ఉపాధ్యాయుడు వారం రోజుల నుండి విధులకు గైర్హాజరు అవుతున్నందున వాంకిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సముదాయం ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాస్, ఎస్‌సిఆర్‌పి రాజేశ్వర్‌కు షోకాస్ నోటీసులు జారీ చేయాలని జిల్లా గిరిజన అభివద్ధి శాఖ అధికారి రమాదేవిని ఆదేశించారు. దేశానికి బావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యతాయుతమైన పాత్ర ఉపాధ్యాయులదేనని, ఇక ముందు సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిఎంఓ పి.ఉద్ధవ్, తహసీల్దార్ రహీముద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - దహెగాం

మహిళలకు సఖీ అండగా ఉంటుందని, సఖీ సేవలను వినియోగించుకోవాలని సఖీ సిబ్బంది తెలిపారు. బుధవారం మండలంలోని హత్తిని, పీపీరావ్ కాలనీ, కల్వాడ, కొంచవెల్లి, పెసరిగుంట గ్రామాల్లో సఖీ టీం మహిళలకు అవగాహన కల్పించారు. గృహహింస, వరకట్న వేదింపులు, అక్రమ రవాణా, ఆడపిల్ల అమ్మకం, పనిచేసే చోట వేదింపులు, లైంగిక వేదింపులు, హింస, బాల్య వివాహాలు లాంటి సమస్యలుంటే సఖీ హెల్ప్‌లైన్ నెంబర్ 181కు కాల్ చేయాలని పేర్కొన్నారు. పోలీస్ సేవలు, న్యాయ సేవలు, వైద్యం, తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్ సేవలపై అవగాహన కల్పించారు. అలాగే బాధిత మహిళలకు ఉచిత వాహన సౌకర్యం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సఖీ సిబ్బంది పవిత్ర, సత్యశీల, రఘు, వినయ్, ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నాగోబా సన్నిధిలో కొత్త కుండలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మెస్రం వంశీయులు నాగోబా ప్రచార రథం బయలు దేరే ముందు సిరికొండలోని కుమ్మరులు దుద్దిల్ల స్వామికి పూజ కోసం ఉపయోగించే కొత్త కుండలకు బయాన ఇచ్చారు. ఆ కుండలను పూజారులు మెస్రం కోసు, కొత్వాల్ దాదేరావ్, ధర్ము ఆధ్వర్యంలో నాగోబా సన్నిధికి చేర్పించారు.

మర్రి చెట్టు వద్ద తూం(కర్మకాండ) కార్యక్రమం

వట వృక్షం కింద సేత తీరుతున్న మెస్రం వంశీయులు బుధవారం రాత్రి తూమ్(కర్మ కాండ) నిర్వహించారు. ఈ సందర్భంగా చనిపోయిన తమ పూర్వీకుల పేరిట తూమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగోబా ఆవరణలో చనిపోయిన వారి పేరిట కర్మ కాండ నిర్వహించడం వల్ల తమ పూర్వీకుల ఆత్మకు శాంతి కలుగుతుందని వారి నమ్మకం.

కేజీబీవీలో వీడ్కోలు సంబరాలు

బోథ్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం వీడ్కోలు సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. బంజారా పాటలపై నృత్యాలు చేసి సందడి చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ఎస్ఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరెకుల సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

దహెగాం : మండల కేంద్రంలో బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం నారాయణ, తాలుకా ఉపాధ్యక్షుడు చప్పిడి బక్కయ్య, మండల అధ్యక్షుడు తుమ్మిడి నారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆరెకుల సంక్షేమ సంఘం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తమ కులానికి ఓబీసీ సర్టిఫికెట్ సాధనే లక్ష్యంగా కమిటీలు వేస్తున్నట్టు వారు తెలిపారు. అధ్యక్షుడిగా చప్పిడి తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా పాలె ఊషన్న, ప్రధాన కార్యదర్శిగా బుడిపెల్లి ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా సామెర మల్లేష్, ఎల్కారి ప్రశాంత్, కోశాధికారిగా తుమ్మిడి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా తుమ్మిడి సురేష్, ఎల్కారి శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎలకరి తిరుపతి, నికాడి మల్లేష్, వెంకన్న బావాజీ, సలహాదారులుగా చప్పిడి సంజీవ్, చౌదరి దామోదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పంట పైసల కోసం పరేషాన్..!

- ఏ ఖాతాలో పడుతున్నాయో తెలియక తికమక
- డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- వెయ్యికి రూ.10చొప్పున కోత విధిస్తున్న కొన్ని బ్యాంకులు
- నష్టపోతున్న కర్షకులు..దృష్టిసారించని యంత్రాంగం

అన్నదాతలకు ఆధార్ కష్టాలు ఇంకా తొలగడం లేదు. దళారుల బెడదను నివారించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త విధానం అన్నదాతలకు కష్టాలు తెచ్చిపెడుతోంది. ఈ విధానంలో భాగంగా రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు ఆధార్ చేయడంతో ఏ బ్యాంకులో డబ్బులు పడుతున్నాయో తెలియక తికమకపడాల్సి వస్తోంది. బ్యాంకు సిబ్బంది రైతులకు సంబంధించి ఏ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేశారో తెలియక అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫలితంగా పంట డబ్బులు తీసుకొనేందుకు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. మరోపక్క ఒకటి, రెండు ప్రయివేటు బ్యాంకులు ఇదే అదనుగా దోపిడి పర్వానికి తెరపలేపినట్లు తెలిసింది. రైతుల డబ్బులు సదరు బ్యాంకులో పడటంతో వాటిని తీసుకొనేందుకు రూ.వెయ్యికి రూ.10చొప్పున చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆదిలాబాద్ జిల్లాలో వందలాది మంది రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మార్కెట్‌లో దళారుల బెడదను అరికట్టేందుకు ప్రభుత్వం రైతుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది. దీంతో మార్కెట్‌లో పంటలను విక్రయించాలంటే పట్టాపాసు పుస్తకం కలిగిన ప్రతి రైతు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సూచించడంతో జిల్లావ్యాప్తంగా రైతులు మార్కెట్‌లకు వచ్చి ఈ ప్రక్రియ పూర్తిచేయించారు. కానీ అనేక మంది రైతులు వివిధ అవసరాల నిమిత్తం రెండు నుంచి నాలుగు వరకు బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉన్నారు. కానీ మార్కెట్‌లో సిబ్బంది రైతులు రెగ్యూలర్‌గా లావాదేవీలు కొనసాగించే బ్యాంకు ఖాతాలకు కాకుండా వారి ఇష్టం వచ్చిన ఖాతాలకు అనుసంధానం చేయడంతో అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. కొందరు రైతులు చివరగా ఏ బ్యాంకులో ఖాతా తెరిచారో వాటిని సిబ్బంది పరిగణనలోకి తీసుకొని అనుసంధానం చేసినట్లు తెలిసింది. దీంతో మార్కెట్‌లో పంట విక్రయించిన రైతుల డబ్బులు ఏ బ్యాంకు ఖాతాలో పడ్డాయో తెలియక తికమక పడాల్సి వస్తోంది. పంట పైసలను తీసుకొనేందుకు రైతులు ఆయా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. మార్కెట్ ప్రారంభంలోనే ఈ సమస్య ఉత్పన్నమైనా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. రైతులు, రైతుల సంఘాల ప్రతినిధులు సైతం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వెయ్యికి రూ.10కోత..?

రైతుల కష్టాలను రెట్టింపు చేసేలా కొన్ని ప్రయివేటు బ్యాంకులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నట్లు లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆరోపణలున్నాయి. వందలాది మంది రైతులకు సంబంధించి పత్తి, ఇతర పంట అమ్మకాలకు సంబంధించి డబ్బులు సదరు ప్రయివేటు బ్యాంకుల ఖాతాల్లో పడటంతో వాటిని తీసుకునేందుకు అక్కడ పడిగాపులు పడాల్సి వస్తోంది. డబ్బులు తీసుకోవాలంటే రూ.వెయ్యికి రూ.10చొప్పున తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఇలా తన డబ్బులు తాను తీసుకోవాలన్నా..ఒక్కో రైతు వేల రూపాయిలు నష్టపోతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క కొన్ని బ్యాంకులు ఒకేసారి రూ.2లక్షలు ఇవ్వడం లేదు. దీంతో విడతల వారీగా ఇస్తుండటంతో రైతులు పలుమార్లు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సమస్య వందలాది మంది రైతులను వేధిస్తున్నా అధికారులు దృష్టిసారించడం

ఈ సమస్యను పరిష్కరించాలి : బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు



రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసిన నాటి నుంచి రైతులకు ఈ కష్టాలు ప్రారంభమయ్యాయి. రైతులు చెప్పిన ఖాతాలకు కాకుండా ఇతర ఖాతాలకు అనుసంధానం కావడంతో ఏ బ్యాంకులో డబ్బులు పడుతున్నాయో తెలియడం లేదు. మరోపక్క కొన్ని బ్యాంకులు రూ.వెయ్యికి రూ.10కోత విధించడం సరికాదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి.



ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు స్వామి. ఇటీవల మార్కెట్‌లో పత్తి విక్రయించడంతో వీటి తాలుకు డబ్బులు రూ.1.80లక్షలు రావాల్సి ఉంది. ఈయనకు రెండు బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. ఈయనకు రెగ్యూలర్‌గా లావాదేవీలు కొనసాగించే బ్యాంకులో కాకుండా ఉపాధిహామీ నిమిత్తం ఓ ప్రయివేటు బ్యాంకులో తీసిన ఖాతాలో పత్తి పైసలు పడ్డాయి. ఈ పైసలు తీసుకొనేందుకు సదరు బ్యాంకు రూ.వెయ్యికి రూ.10చొప్పున కోత విధించి డబ్బులు అందించింది. దీంతో ఈ రైతు బ్యాంకులో పడిన 1.80లక్షలు తీసుకునేందుకు రూ.1400లు కోల్పోవాల్సి వచ్చింది. ఇలా వందలాది మంది రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మాడేగామ్ మిషన్ భగీరథ శుద్ధ జల కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని మాడేగామ్ మిషన్ భగీరథ శుద్ధ జల కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. దీంతో పాటు న్యూలోలంలో శెగ్రిగేషన్ షెడ్, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, మురికాలువలు, ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను పరిశీలించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా 7 నుండి 14 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో మాడేగామ్ మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను మొదట పరిశీలించి నీటి శుద్ధి ప్రక్రియ, పంపింగ్ సామర్థ్యం, స్టోరేజ్ వంటి వివరాలను మిషన్ భగీరథ ఈఈ సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే ఇంటింటికి నల్లా నీరు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను ప్రతిరోజు రెండు సార్లు నింపాలని తెలిపారు. అనంతరం లోలం గ్రామపంచాయతీలో జరిగిన పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో శేగ్రిగేషన్ షెడ్, నర్సరీ అవెన్యూ ప్లాంటేషన్, ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను పరిశీలించి, వారం రోజుల పాటు జరిగే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి, మురికి కాలువల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఈఈ సందీప్, ప్రత్యేక అధికారి సరిత, ఎంపీడీఓ మోహన్, ఎంపీఈఓ అజీజ్‌ఖాన్, ఏపీవో దివ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఐకెపి ఏపీఎం రాణి పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖపై సమీక్ష

నిర్మల్ : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సమావేశానికి, ఇప్పటికీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, శ్యామ్‌మామ్, న్యూట్రిషన్ గార్డెన్, మిషన్ వాత్సల్య, అంగన్వాడీ భవనాలు తదితర వాటి పురోగతిని మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సామ్‌మామ్ పిల్లలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ విషయాన్ని గత సమావేశంలోనే చెప్పడం జరిగిందని, అయినా శ్యామ్‌మామ్ పిల్లలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించి, సరైన సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రయివేట్ భవనాలలో ఉన్న అంగన్ కేంద్రాల వివరాలు, అందులో ఏమైన రిపేర్స్ ఉంటే నివేదికలు అందజేయాలని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీడబ్ల్యుఓ నాగమణి, సీడీపీఓలు, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలి: రాహుల్ రాజ్



ఆదిలాబాద్‌టౌన్ : అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలనీ కలెక్టర్ రాహుల్ రాజ్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసెంబర్ 2023 మాసాంతపు జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయాలని సూచించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం క్రింద అర్హులైన లబ్దిదారులకు యూనిట్లను మంజూరు చేయాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు రూపొందించి నిర్ణిత గడువులోగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణ పరిమితిని పెంచాలని, ఇచ్చిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసేలోగా వారి లక్ష్యాలను అధిగమించాలన్నారు. రైతులకు పంట, అనుబంధ రుణాలతో పాటు, డైరీ, పౌల్ట్రీ, తదితర యూనిట్లను మంజూరు చేయడం ద్వారా రైతులకు రెండు రకాల ఆర్థిక ప్రగతి పెరుగుతుందన్నారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై చర్చించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వంద శాతం ఆర్థిక ప్రగతి సాధించినందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం వెంకట్‌రామ్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎల్డీఎం ప్రసాద్, నాబార్డ్ డీఎమ్ ఎండి రవూఫ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్లు భాగస్వాములు కావాలి



నవతెలంగాణ-కడెం

రోడ్డు ప్రమాదాల నివారణలో వాహన డ్రైవర్లు భాగస్వాములు కావాలని ఖానాపూర్ సీఐ డి.మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని పాండ్వాపూర్, కన్నాపూర్ గ్రామాల్లో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, డ్రైవర్లు రోడ్డు మీద తమ వాహనాలను వ్యతిరేక దిశలో నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. వాహనాన్ని నడిపే డ్రైవర్లు కంటి చూపుపై అశ్రద్ధ చూపవద్దని, దగ్గరచూపు, దూరపుచూపు లోపాలు ఉంటే కంటి వైద్యులను సంప్రదించాలని తెలిపారు. డ్రైవర్లకు కంటిచూపు బాగా ఉంటేనే ప్రయాణికులను వారి గమ్యాలకు సురక్షితంగా చేర్చుతారని, వారు కూడా కుటుంబాలను కలుసుకొని సంతోషంగా ఉంటారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై కొసన రాజు, ఎఎస్సై దేవ్, పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

పాండ్వాపూర్‌లో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించి అనుమతి పత్రాలు లేని 32 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ డి.మోహన్ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, ఏఎస్సై దేవ్, పోలీసులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



దహెగాం : చదువుతోనే పేదరికం దూరమవుతుందని, పేదరిక నిర్మూలన పోరాట సమితి(పీఎన్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ అన్నారు. పీఎన్పీఎస్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన కోసం గడపగడపకు 12 వేల కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా బుధవారం దహెగాంకు చేరుకొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కేజీ టూ పీజీ చదువుకోవాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపులే, సావిత్రీబాయి పూలేలు చెప్పినట్టు చదువుతోనే పేదరికం దూరమవుతుందని పేర్కొన్నారు. పిల్లలు చదువు అర్ధాంతరంగా ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీదనే ఉందని సూచించారు. పేద వర్గాలను చైతన్య పరిచేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఆటో డ్రైవర్లు వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, కోకన్వీనర్ చంద్రగిరి రవీందర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రం నుంచి మహాగావ్ వెళ్లే రహదారి మొత్తం ధ్వంసమైందన మరమత్తులు పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్‌ను జిల్లా ట్రైబల్ నాయకులు జాదవ్ సంజీవ్ నాయక్ కోరారు. బుధవారం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైందని, రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నందున తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు జాదవ్ సూరజ్, దత్తారాం ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-ఉట్నూర్



కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం గావ్ ఛలో, ఘర్ ఛలో అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మహేందర్, అసెంబ్లీ కో కన్వీనర్ నంది రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్, జాతీయ నాయకులు గుగ్లోత్ శ్రీరామ్ నాయక్, విజయ్, భీంరావ్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

సీఎం రేవంత్ రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంతో పాటు సొనాలలో బస్టాండ్ సమీపంలోని బాల్క సుమన్ చిత్రపటం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి, చట్టసభలకు ప్రాతినిధ్యం వహించి కనీసం చట్టసభల గౌరవ మర్యాదలు లేకుండా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులపై పౌరుష పదజాలంతో అసభ్యకరంగా విమర్శించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు రెడ్డి ఇట్టేడి, ఎంపీటీసీ కుర్మ మహేందర్, నాయకులు గుడల శేకర్, సిర్పూర్ మహేష్, బలిరాం, పోషెట్టి, మద్దెల మహేష్, గంగారెడ్డి, రమణ, నల్ల శ్రీకాంత్ రెడ్డి, అనిల్ రెడ్డి, విలాస్ రెడ్డి, షేక్ అబుద్ పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమ అధికారిగా సబిత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా సంక్షేమ అధికారిగా ఎం.సబిత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇది వరకు సంక్షేమధికారిగా మిల్కా కొనసాగా ఆమె స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం సంక్షేమ అధికారిగా ఉన్న సబితాను బదిలీ చేశారు. కాగా బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మిల్కా నుంచి సబిత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, చైల్డ్ వెల్ఫర్ కమిటీ సభ్యులు సమీరుల్లా ఖాన్, సామల దరశరత్, డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు స్వాగతం పలికారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్



ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంఈఓ ఆశన్న సూచించారు. బుధవారం గాదిగూడ మండలంలోని కోలామా(జీ), కోలామా ఎస్సీ, మారుగూడ, లోకారి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పట్టిక, మధ్యాహ్నం భోజన రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఆయా పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన భగవాన్ దాస్ రిటైడ్ వీఆర్ఓ సతీమణి పార్వతీ బాయి, భుమా బాయి అనారోగ్యం బుధవారం మృతి చేందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాదిత కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అయన వెంట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులున్నారు.

గాదిగూడలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మడావి గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలో సంఘం జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశం కరపత్రాలు విడుదల చేశారు. ఈనెల12 న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, ఎస్వీ శ్రీకాంత్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గాదిగుడ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఆదివాసులకు హామీ ఇచ్చిన కళాశాల ఏర్పాటు చేయలేదన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ఆదిలాబాద్ జిల్లా దత్తత తీసుకుంటే ఈ మండలాన్ని గుర్తించి ఇక్కడ జూనియర్ కళాశాలతో పాటు ఎమ్మార్సీ కార్యాలయం, జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, తరుణ్, మహేష్, తులసిరాం, భీంరావ్, నవీన్, మహేష్, నగేష్, తానాజి పాల్గొన్నారు.

ప్రయివేటుకు ధీటుగా సౌకర్యాలతో ఆర్టీసీ బస్సులు

- రాత్రివేళ ప్రయాణికులకు అందుబాటులోకి స్లీపర్ కోచ్
- ఉమ్మడి జిల్లాకు 16 బస్సుల కేటాయింపు
- నూతన హంగులతో ఆకట్టుకుంటున్న బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేటు ఆపరేటర్ల పోటీని తట్టుకునేలా టీఎస్ఆర్టీసి యాజమాన్యం ప్రయాణీకులకు పలు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందులో భాగంగానే రాత్రి వేళల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారి కోసం స్లీపర్ బస్సు సేవలను ప్రారంభించింది. ఇదివరకు ఇంద్ర పేరుతో ఏసీ బస్సులు అందుబాటులో ఉన్నపటికీ రాత్రి వేళలో ప్రయాణించే వారు నిద్రించేందుకు వీలుగా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. లహరీ- అమ్మ ఒడి అనుభూతి అనే ట్యాగ్ లైన్‌తో ఈ బస్సులకు నామకరణం చేసిన యాజమాన్యం ఇటీవలే వీటి సేవలను సైతం ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 16 సిట్టింగ్, స్లీపింగ్ బస్సులను కేటాయించగా ఆదిలాబాద్ డిపోకు ఆరు బస్సులను కేటాయించారు. వీటిలో నాలుగు ఏసీ బస్సులు కాగా మరో రెండు నాన్ ఏసీ బస్సులు ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణం సాగించేలా ఉచిత వైఫై, మొబైల్ చార్జింగ్, ప్రతి బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్, భద్రత పరంగా సీసీ కెమెరాలు లాంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు వీటిలో ప్రయాణించే ప్రయాణీకులకు పౌష్టికాహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్‌ను సైతం అందించనున్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వీటిని లాంఛనంగా ప్రారంభించగా జనవరి 24 నుంచి అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్ రూట్‌లో నాలుగు ఏసీ బస్సులు, ఒంగోలు రూట్‌లో మరో రెండు బస్సులను ఆదిలాబాద్ డిపో నుంచి నడుపుతున్నారు. టిక్కెట్ ఖరీదు కాస్త ఎక్కువే అయినా సౌకర్యవంతంగా ఉండటంతో ప్రయాణీకులు సైతం వీటిని ఆదరిస్తున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి : కల్పన, డిపో మేనేజర్, ఆదిలాబాద్

ప్రయాణికుల సౌకర్యార్థం కోసమే స్లీపర్ బస్సులు ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టిసి కొత్తగా ఎసీ స్లీపర్ బస్సు సేవలను ప్రారంభించాం. అన్ని హంగులతో పాటు సురక్షిత ప్రయాణం అందించడం తమ ప్రత్యేకత. అలాగే హైదరాబాద్ వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం కోసం అదనంగా రెండు ఎక్స్ ప్రెస్ సర్వీసులను ప్రారంభించాం. ఆర్టిసి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



లహరి బస్సులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క(ఫైల్)



జిల్లా వచ్చిన లహరి బస్సులు (ఫైల్)

ఫ్యాక్టరీని తరలించాలంటూ కాలనీవాసుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని పిట్టలవాడలో పీఓపీ ఫ్యాక్టరీని తరలించాలని కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టి దాని వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్ అక్కడికి చేరుకుని కాలనీ వాసులతో మాట్లాడారు. ఫ్యాక్టరీని మూసివేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నారాయణ మాట్లాడుతూ 1984లో కాటన్ ఆధారిత పరిశ్రమగా ఆయిల్ మిల్ కోసం ఈ స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. కానీ సదరు వ్యక్తి మాత్రం పీఓపీ పరిశ్రమకు ఇచ్చారని తెలిపారు. ఈ పరిశ్రమ నుంచి దుమ్ము, దూళి, దుర్వసన వస్తుందన్నారు. దాని కారణంగా ఉపిరితిత్తుల సమస్యల వచ్చే ప్రమాదం ఉందన్నారు. కొంతమంది యాజమాన్యం వారికి ఇచ్చిన అనుమతి మేరకు నడపకుండా బంగారు దుకాణానికి ఒకరు, పీఓపీ తయారీకి మరొకరు, టాటా షోరూం కోసం, గోదాముల కోసం ఇలా వారి ఇష్టమొచ్చినట్లు పద్దతిలో లీజు కిచ్చి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. తాము అనేకసార్లు అధికారులకు విన్నవించిన స్పందించడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు వస్తున్నారు పోతున్నారు కానీ పరిశ్రమ ఆగడం లేదన్నారు. అధికారులు స్పందించి పీఓపీ పరిశ్రమతో పాటు దీనికి ప్రక్కనే ఉన్న బంగారు దుకాణాన్ని కూడ జనానివాసలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు జీవన్, మురళి, మాధవ్, అబ్బు, సాహెరా, లత మేడం, అభిమాన్, దౌలత్ రావు, శ్రీకాంత్, తోతారం, చిరంజీవి, వెంకటేష్, లతీష్, విజయ్ పాల్గొన్నారు.

పనులను ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ఉట్నూర్

15వ పంచవర్ష ప్రణాళికలో మంజూరు అయిన పనులను ఎంపీపీ పంద్ర జైవంత్ ప్రారంభించారు. బుధవారం మండలంలోని కొలంగూడ-జీ , దంతన్ పల్లి, మత్తడి గూడ తదితర గ్రామ పంచాయతీలో పనులను ప్రారంభించి నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొడప అనసూయ, మాజీ సర్పంచ్ మడవి యశోద బాయి, గ్రామ పటేల్ సోనే రావు, మోతిరాం, గ్రామ పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.



ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రోడ్డు భద్రతపై గుడిహత్నూర్ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ రోడ్డుపై సూచనలను పాటించాలాన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. దీంతోపాటు మహాలక్ష్మి టికెట్ల గురించి మహిళా ప్రయాణికులు వివరిస్తూ బస్సులో ప్రయాణించేటప్పుడు తమతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు, ఏదైనా ఇతర గుర్తింపు కార్డ్ ఒరిజినల్ తమ వెంట తీసుకువెళ్లాలన్నారు. అలాగే నాగోబా, సమ్మక్క సారక్క జాతరకు మహిళలందరికీ ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. దీనితో పాటు ఆర్టీసీ గమ్యం యాప్ గురించి వివరిస్తూ ప్రయాణికులకు ఇన్‌స్టాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడీసీటీ ప్రేమ్ సింగ్, భాగ్యవతి, విలేజ్ బస్ ఆఫీసర్ సి.సతీష్ పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- ధనోర, ఇన్‌కర్‌గూడలో జోరుగా బెల్టు షాపులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కేస్లాపూర్ నాగోబా జాతర ఈ నెల 9 నుంచి 15 వరకు కొనగగనుంది. అయితే జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎక్సైజ్,పోలీసుల శాఖ ల ఆధ్వర్యములో ఎలాంటి బెల్ట్ షాపులు, మత్తు పానీయాలు,నార్కోటిక్ డ్రగ్ దందా నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని ఇటీవల నాగోబా దర్బార్ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో సూచించారు అయిన అధికారుల్లో ఎక్కడ చలనం రాలేదు. దనోర, ఇంకర్ గూడ లో రోడ్డు పక్కనే ఏచెచ్చంగా బెల్టు షాపు ల్లో అక్రమ మద్యం అమ్మి ఆదివాసీ యువతకు కుచ్చుటోపీ పెడుతున్నారు.దీంతో ఇప్పుడిప్పుడే అభివద్ధి వైపు పయనిస్తున్న ఆదివాసులకు బెల్ట్ షాపుల నిర్వాహకులు వల్ల యువత పేడ దాటిన పడే అవకాశం మెండుగా కనిపిస్తోంది.

మోసం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఏరియా ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రతిపతికన పని చేస్తున్న వారికి సంబంధిత కాంట్రాక్టర్ జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. బుధవారం జిల్లా సమితి సభ్యురాలు రథోడ్ కౌశల్య ఆధ్వర్యంలో ఆస్పత్రిలో సమావేశం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిండం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలను కోతలు విధిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంగీత, కమలబాయి, సరితా, సతీష్, వంశీ, రాధ, శోభ పాల్గొన్నారు.

గృహలక్ష్మీ సర్వేకు వినియోగదారులు సహకరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గృహలక్ష్మీ పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తుందని, సిబ్బంది ఇళ్లకు వచ్చి సర్వే నిర్వహిస్తున్నారని దీనికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహన్ కోరారు. బుధవారం పట్టణంలో కొనసాగుతున్న గృహలక్ష్మీ పథకం సర్వే తీరును ఆయన పరిశీలించారు. బిల్లింగ్ సిబ్బందితో కలిసి బిల్లుతో పాటు వివరాలను నమోదు చేశారు. వినియోగదారులతో మాట్లాడుతూ సిబ్బందికి అవసరమైన పత్రాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహన్ మాట్లాడుతూ ప్రభుత్వం గృహలక్ష్మీ కింద 200 యూనిట్లను అందిస్తుందన్నారు. దీని కోసం బిల్లింగ్ సిబ్బందితో రెండు రోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి వచ్చే సిబ్బందికి వినియోగదారులు ఆధార్, ఫుడ్ సెక్యూరిటి కార్డు, ప్రజాపాలనలో దరఖాస్తు రోసేదు, ఫోన్ నంబర్లను తెలియజేయాలని సూచించారు. ఇంట్లో లేని వారి ఆ వివరాలను మీటర్ సమీపంలో రాయాలన్నారు. ఈనెల 15వ తేది వరకు సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి అందించడం జరుగుతుందన్నారు. వినియోగదారులు వివరాలను సక్రమంగా తమ సిబ్బందికి అందించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ శంకర్, డీఈలు హరికృష్ణ, దేవన్న, ఏఈ నమ్రత, ఏడీ దుర్గ ప్రసాద్ ఉన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మించాలి

నవతెలంగాణ-నార్నూర్

కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేలా ప్రతి ఒక్కరు సహకారం అందించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు జాదవ్ ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని బెతల్‌గూడ గ్రామ పంచాయితీ పరిధిలోని సోనాపూర్ గ్రామంలో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి ప్రతిజ్ఞ చేయించి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చౌహన్ చరణ్ దాస్, మాన్కు బాయి, బాపూరావ్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, అంగన్‌వాడీ రత్న కుమారి, ఆశాలు నిర్మల, భోజ్జుబాయి, గ్రామపెద్దలు రవీందర్, కిరణ్ ఉన్నారు.

ప్రత్యేక అధికారిని సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. గ్రామ అభివృద్ధిలో ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోనాల అధ్యక్షులు చెట్లపెల్లి అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ రమేష్ బత్తుల, నాయకులు గాజుల పోతన్న, విజయ్ భాస్కర్ రెడ్డి, కసిరె పోతన్న పాల్గొన్నారు.



రామాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేనిది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మాతా రామాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేనిదని చిచ్‌ధరి అశోక బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షులు గౌతం వాగ్మారే అన్నారు. బుధవారం గ్రామంలోని అశోక బుద్ధ విహార్‌లో రామాబాయి అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రామాబాయి, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, త్రిశరన్, పంచశీల్ పాటించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించి, రాత్రి భజన సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో వినోద్ తిగోటే, సంజీవ్ గాయికాంబ్లే, గంగాధర్ తిగోటే, గజానంద్ కోకటే, పిప్పల్‌ధరి మండల సాధన కమిటి కార్యదర్శి వాగ్మరే దినబంధు, ప్రజ్ఞాశీల్ యూత్ అధ్యక్షులు గజానంద్ కోకటే, ఉపాధ్యక్షులు ధన్‌రాజ్ తిగోటే, కార్యదర్శి సిద్దార్థ గాయికాంబ్లే, సహాయ కార్యదర్శి నితీష్ వాగ్మారే, కోశాదికారి రాష్ట్రపాల్ తిగోటే, సభ్యులు ప్రజ్ఞశీల్ సర్కలే ఉన్నారు.

పిప్పల్‌ధరిలో..

లుబింని బుద్ధ విహారంలో రామాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. రామాబాయి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటి అధ్యక్షులు గజానంద్ తాక్సాండే, సభ్యులు గులే మోహన్, మార్షెట్టి కిష్టయ్య, టంకే హిరాలాల్, నగ్‌రాడే జ్ఞానేశ్వర్, టంకే నాగోరావ్, తాక్‌సాండే దివాకర్, మూక్‌నాయక్ యూత్ ఉపాధ్యక్షులు టంకే ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ : లక్ష్మీపూర్ గ్రామంలోమహార్ సంఘం ఆధ్వర్యంలో రామాబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మహార్ సంఘం ఉపాధ్యక్షులు బద్రే సుభాష్, కైలాస్, అశోక్, జైపాల్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు, భోపాపూర్, తాడిహత్నూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ బుద్ధ విహార్ ప్రాంగణంలో బుధవారం రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ మానే కళ్యాణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో రమాబాయి 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రమాబాయి అందించిన సేవలను స్మరించుకుంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు దాసం రాజేశ్వర్, దాసరి అరుణ్, ప్రధాన కార్యదర్శి తిగుట్ల రాజ్ కుమార్, కార్యదర్శి సంజయ్ తుడిచేర్ల, దర్శన అంజన్న, రాములు, దాకూరి రాములు, చిట్టిమల్ల వెంకటేష్, హరీష్ అలేటి, వెంకటేష్ పాల్గొన్నారు.



ఖానాపూర్ : పట్టణంలోని విశ్రాంతి భవనంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ జిల్లా చైర్మన్ బానావత్ గోవింద్ నాయక్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు రసమళ్ల అశోక్, డాక్టర్ రాజ్‌కుమార్, మహిషా, శ్రీనివాస్, రమణ, మ్యాదరి రాజేశ్వర్, బాదినేని రాజేశ్వర్, శేషాద్రి పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో రమాబాయి 126వ జయింతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ అమృత్‌రావు పాటిల్, మహిళా మండలి సభ్యులు పాముల జోత్స్న, ఆత్మ డైరెక్టర్ తిరుమల పాటిల్, లక్ష్మి చక్రవర్తి ప్రేమల, మునేశ్వర్ సోమన్న, పాముల సంతోష్, దేవ్‌రావు, లక్ష్మణ్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

నార్నూర్ :



బోథ్:





ఉట్నూర్:



జైనథ్:

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని గణేష్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్, షేక్ మహెమూద్‌పై అట్రాసిటీ కేసు నమోదుచేసినట్టు ఎస్సై సాగర్ తెలిపారు. భీంరావు తన పనుల నిమిత్తం చేనుకు వెళ్తుండగా షేక్ అబ్దుల్ రూ.300 ఇవ్వాలని, ఎప్పుడిస్తావురా అంటూ అనడంతో రూ.300లాకు గాను రూ.500లు ఎప్పుడో ఇచ్చానని, ఇప్పుడు నీకు ఎలాంటి డబ్బులు ఇచ్చేది లేదన్నాడు. దీంతో షేక్ అబ్దుల్ కర్రతో భీంరావు తలపై కొట్టి మళ్లీ కుర్చీతో కొట్టాడు. భీంరావుకు తలపై గాయం కాగా అబ్దుల్ తండ్రి షేక్ మహెమూద్ కూడా బిచ్చగాడని కులం పేరుతో దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. సోనాపూర్ నుండి కోవ విజయ్ అటువైపు నుండి వస్తుండగా గొడవ జరుగడాన్ని గమనించి భీంరావును అక్కడి నుండి తీసుకెళ్లాడు. నన్ను కులం పేరుతో దూషించి కొట్టడంతో షేక్ అబ్దుల్, షేక్ మహెమూద్‌పై చర్యలు తీసుకోవాలని చిత్రం భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదుచేశామని ఎస్సై సాగర్ తెలిపారు.

సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రైతుల వద్ద నుండి సీసీఐ ద్వారా పూర్తిస్థాయిలో పత్తిని కొనుగోలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ సంఘం రైతు అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్‌తో కలసి అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ శాతం వ్యవసాయం పత్తి పంటపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 70శాతం మంది రైతులు పత్తి పంటను అమ్మినప్పటికీ మిగతా రైతులు ఇప్పుడిప్పుడే జిన్నింగ్ మిల్లులకు పంటను తరలిస్తున్నారన్నారు. జిల్లాలో సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానపెల్లి, దహెగాం పరిసర ప్రాంత రైతులు 15 నుండి 20 రోజులు ఆలస్యంగా విత్తనాలు విత్తుకోవడంతో దిగుబడి కూడా ఆలస్యంగానే చేతికి వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని సీసీఐ ద్వారా పంటకోత పూర్తయ్యే వరకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, మండోరే తుకారాం పాల్గొన్నారు.

కౌలు రైతుల కష్టాలు తీరేనా..?

- రుణం పొందలేరు..పంట విక్రయించలేరు
- కొత్త సర్కారుపైనే కొండంత ఆశలు
- నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

సొంత భూమి లేకపోయినా.. కర్షకుల మాదిరి కష్టపడి పంటను పండిస్తున్న కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కష్టాల్లో పడిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎంతో కొంత సాయం దక్కుతున్నా.. కౌలు పరిస్థితి మాత్రం దయనీయంగా మారింది. వీరికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారు. కనీసం పండిన పంటను మార్కెట్‌లో విక్రయించాలన్నా..భూ యజమాని పేరిటే విక్రయించాల్సి వస్తోంది. వ్యవసాయ రంగంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కౌలు రైతును అటు ప్రభుత్వము, ఇటు బ్యాంకర్లు గుర్తించకపోవడంతో ఆదుకునే వారికోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.మరోపక్క కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేస్తామని హామీనివ్వడంతో వారిలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారిస్తుందని కొండంత ఆశతో ఉన్నారు.



నవతెలంగాణ- ఆసిఫాబాద్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాల్లో మొత్తం రైతులు 1,13,812 మంది ఉండగా వీరిలో 30 వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కౌలు రైతుకు చేయూతను ఇవ్వడానికి ప్రత్యేకంగా కౌలు రైతు చట్టం ఉన్నప్పటికి దానికింద నమోదయ్యింది అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో కేవలం 90 మంది మాత్రమే. అంటే ఇటువంటి చట్టం ఉన్నదని జిల్లాలో అనేక మంది రైతులకు తెలియదు. ఇదే సందర్భంలో సమాజంలోని ప్రజల కోసం ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పతకాలు ప్రవేశ పెడుతుంది. అయితే దానికి విరుద్ధంగా గత ప్రభుత్వం కౌలురైతులకు తాము ఎటువంటి సాయం చేయలేమని ప్రకటించడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కౌలు రైతులు మనోవేదనకు గురవుతున్నారు.

కనికరించని ప్రభుత్వం.. కరుణించని బ్యాంకులు

ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఖరీఫ్, రబీ పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. బ్యాంకులు కూడా రుణ ప్రణాళిక ఖరారు చేసి రైతులకు రుణాలు ఇచ్చే పేరుతో సాగుదారుడైన కౌలు రైతును కాదని భూ యజమానికి రుణాలు ఇస్తున్నాయి. దీనితో భూ యజమాని కౌలుదారుని దగ్గరి నుండి, రుణాల పేరుతో బ్యాంకుల దగ్గరినుండి, పెట్టుబడి సాయం పేరుతో ప్రభుత్వం దగ్గరి నుండి నగదును పొందుతున్నారు. ఈ విషయాన్ని కూడా అటు ప్రభుత్వాలు, ఇటు బ్యాంకర్లు గుర్తించకపోవడంతో కౌలు రైతుల కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. దీనికి తోడు గత ప్రభుత్వం ప్రకటించిన రైతుభీమా కూడా కౌలు రైతులకు వర్తించక పోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. గతంలో కౌలు రైతులకు ప్రభుత్వం రుణ అర్హత కార్డులు అందించడంతో అప్పట్లో వారు బ్యాంకుల నుంచి రుణాలు పొందే సౌలభ్యం ఉండేది. కానీ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పడిన ప్రభుత్వం కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు నిలిపివేసింది. దీంతో బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో కౌలు రైతులకు కూడా పెట్టుబడి కింద ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించింది. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలో నాలుగింటిని అమలు దశకు తీసుకురాగా కౌలు రైతులు కూడా పెట్టుబడి సాయం కోసం ఆశగా చూస్తున్నారు. నేటి నుండి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోనని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం కౌలు రైతులకు బాసటగా నిలవాలని కోరుకుందాం.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం

- ఉడుతల మల్లేష్, కమాన



కౌలు రైతుకు ఎటువంటి ఆర్థిక సహాయం చెల్లించమని గత ప్రభుత్వ పెద్దలు ప్రకటించడం బాధను కలిగించింది. ఎన్నో ఏండ్ల నుండి 5 ఎకరాలు కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తున్నాము. భూమికి కౌలు ఇస్తున్న తమకు బ్యాంకులు కూడా పంటరుణాలు ఇవ్వడం లేదు. పండిన పంటకు గిట్టుబాటు ధరలు కూడా రాక రెండు పూటల తిండి దొరకడం కూడా కష్టంగా మారింది. ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారడం లేదు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు, బ్యాంకులు అనుసరిస్తున్న విధానాలు మారాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ లాంటి వారికి చేయూతనిచ్చే దిశగా నిర్ణయం తీసుకోవాలి.

పేద కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

దేశవేని వెంకన్న, కమాన, వాంకిడి



వ్యవసాయమే ప్రదాన వృత్తిగా జీవిస్తున్న తాము నేడు సమాజంలో పెరుగుతున్న ధరల నేపథ్యంలో భూమిని కొనుగోలు చేయలేక ఉన్న కాసిన్ని డబ్బులతో భూమిని కౌలు తీసుకొని సాగు చేస్తున్నాము. తమ లాంటి పేద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రతిఏటా ఆరు ఎకరాలు కౌలుకు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. తమకు ఎటువంటి గుర్తింపు ఇవ్వని గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు పోయి తమను మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం తమలాంటి వారిని గుర్తించాలని కోరుతున్నాం.

తెరాస పాలనలో అశాంతిలో రైతన్నలు

- కుశాన రాజన్న, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి



గత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తూ రైతును రాజు చేస్తామని డాంబికాలు చెప్పింది. రైతుబంధు పథకం కేవలం పెట్టుబడి దారులకు, భూస్వాములకు మాత్రమే ఉపయోగపడింది. జిల్లాలో అనేక మంది పేద గిరిజన, కౌలు రైతులు తమకు ఎవరైనా సాయం చేస్తారని ఎదురుచూడగా వారికి నిరాశను మిగిల్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్ సమావేశాల్లో కౌలు రైతులకు భరోసా ఇచ్చేలా ప్రకటన చేయాలి.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామ పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. బుధవారం కిర్డీ గ్రామానికి వచ్చిన కలెక్టర్ హేమంత్ బొర్కాడెకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పనులను పూర్తిచేయాలని, వర్షాకాలంలో పాఠశాలకు ఆనుకొని ఉన్న ఒర్రె భారీ వర్షాలు కురిస్తే ఉప్పొంగి పాఠశాలలోకి వర్షపు నీరు వచ్చి విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు, ప్రజలు కూడా ఈ ఒర్రె వల్ల కష్టాలు పడుతున్నారన్నారు. కల్వర్టు మంజూరుచేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే కల్వర్టు పనులను ప్రారంభించేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని తహసీల్దార్ రహిమొద్దీన్‌కు ఆదేశాలిచ్చారు. గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్

జీపీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. బుధవారం మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్, ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు మండలస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టంపై ప్రత్యేక అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంచాయతీ కార్యదర్శుల సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో నిత్యం జరిగే పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. మురికి కాలువలను శుభ్రం చేయాలని, ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. హరితహారం క్రింద నాటిన మొక్కలను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలు, వైకుంఠదామాలు, డంపింగ్‌యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటుపై పర్యవేక్షించాలన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ, వ్యయాలపై సమీక్షించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించి(ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్)లో నమోదు చేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో అక్రమ వెంచర్ల ఏర్పాటుపై దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన ప్రధాన బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సెక్రటరీ జలేందర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి 126వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో రమాబాయి భీంరావు అంబేద్కర్ 126వ జయంతి వేడుకలను జశ్వంత్ బుద్ధవిహార్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం ఉప్రె అన్నారు. అలాగే మండలంలోని కమాన, కన్నర్‌గావ్, ఇందాని, సరండి తదితర గ్రామాల్లో రమాబాయి భీంరావు అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, విలాస్, అశోక్, సునీల్, రోశన్, విఠల్, రమేష్ పాల్గొన్నారు.

జైనూర్ : రమాబాయి భీంరావు అంబేద్కర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు కామ్లె అన్నారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రమాబాయి భీంరావు అంబేద్కర్ 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మహిళలకు రమాబాయి జీవితం ఆదర్శ ప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కామ్లె సత్యవాన్, గాయిక్వాడ్ సతీష్, సిద్దేశ్వర్, నాగోరావు పాల్గొన్నారు.



జైనూర్‌లో..

ఆసిఫాబాద్ సీఐగా సతీష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణ నూతన సీఐగా గదిగోప్పుల సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీ జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సతీష్‌ను జిల్లా కేంద్రానికి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు రాగ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ అమలు చేస్తూ, శాంతిభద్రతలు పరిరక్షిస్తామన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ఉపయోగకరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. ఆసిఫాబాద్ మోడల్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన "పిల్లల కోసం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో విద్యార్థులు పాలుపంచుకోవడం వల్ల ఎన్నో రకాల కొత్త అంశాలు తెలుస్తాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థి వ్యాలంటరీలకు బ్యాడ్జెస్, బుక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కటకం మధుకర్ ప్రిన్సిపాల్ డా.కనకయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంధ్యారాణి, కళాశాల అధ్యాపకులు స్వామి, మాధవ కృష్ణ, మల్లేష్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫోటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి. భారతి లక్‌పతి నాయక్ హాజరవుతారన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు హాజరవుతారని, జిల్లా శాఖల సంబంధిత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వారంలో నాలుగు రోజులు పత్తి కొనుగోలు

ఈనెల 7 నుండి పత్తి కొనుగోలు తిరిగి ప్రారంభమైందని, ప్రతివారంలో సోమ, మంగళ, బుధ, గురువారాల్లో పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి శుక్ర, శని, ఆదివారాల్లో పత్తి తీసుకొని రావద్దని మూడో విడత పత్తి వస్తుందని నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు.

మహిళ అవార్డులకు దరఖాస్తులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలు, సామాజిక, ఆర్థిక సాధికారత రంగాలలో అసాధారణమైన పరిస్థితులలో విశిష్ట సేవలు అందించిన మహిళలను రాష్ట్ర అవార్డుతో సత్కరించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున అవార్డుల ప్రధానం జరుగుతుందని, అర్హత గల అభ్యర్థుల నుండి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను టీజీఎస్‌ఆర్‌సీడబ్ల్యూఎట్‌దిరేట్‌ఆఫ్‌జీమెయిల్, లేదా హైదరాబాద్‌లోని స్త్రీ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కమిషనర్‌కు దరఖాస్తు ప్రతిని పంపవచ్చని తెలిపారు.

ప్రపంచ అథ్లెటిక్స్ లెవెల్ 2 కోర్స్‌కు ఎంపిక

జిల్లా కేంద్రంలోని ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో అథ్లెటిక్ శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం.విద్యాసాగర్ ప్రపంచ అథ్లెటిక్స్-2 కోర్సుకు ఎంపికయ్యారని గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి బండ మీనా రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేరళలోని త్రివేండ్రంలో ఈనెల 9 నుండి 15 వరకు ప్రపంచ అథ్లెటిక్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న ప్రపంచ అథ్లెటిక్స్ లెవెల్ 2 కోర్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. శిక్షణకు ఎంపిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి పురోగాభివృద్ధిపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ వద్ద మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులు సింగరేణి పురోగాభివృద్ధిపై బుధవారం అవగాహన కల్పించారు. షిఫ్టుల వారీగా ఉద్యోగులకు సింగరేణి సంస్థ సాధించిన ప్రగతి, భవిష్యత్తు కార్యాచరణ, ఉద్యోగులు, యంత్రాల వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఉదయం షిఫ్టు ఉద్యోగులకు ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ సింగరేణి సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్‌లో లక్ష్యాల సాధనకు పనితీరును వివరించారు. రెండో షిఫ్టు ఉద్యోగులకు ప్రాజెక్టు అధికారి నాయిని ఉమాకాంత్ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను క్లుప్తంగా వివరించారు. సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీజీఎం ఎస్‌అండ్‌ఎ రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీడ్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ ఆచార్య, తిరుపతి పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెమోరీ టిప్స్, సమయపాలన, ఏకాగ్రత, జీవిత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవడం, మానవ విలువలు మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ, ఫౌండేషన్ ప్రతినిధులు శంకరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందించిన జీపీ కార్మికులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిమాండ్ల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు ఐక్యంగా చేస్తున్న ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సమ్మెలో తాము పాల్గొననున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి డీపీఓ ఉమర్ హుస్సేన్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటానికి సిద్ధమైందన్నారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనాలు నెలకు రూ.26,000 ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు మాసాల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి పేరక శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు నగేష్, రమేష్, రాజ్ కుమార్, అనిల్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై చర్యలకు వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని చింతగూడ కోయావాగు గ్రామంలో విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు చేపడుతున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తహశీల్దార్, పంచాయతీ ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్‌కు గ్రామానికి చెందిన జాడి దీపక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దేశీదారు, గుడుంబా, కల్తీ మద్యం యదేచ్ఛగా అమ్ముతున్నారని తెలిపారు. గంజాయి సైతం అందుబాటులో ఉంటుందని, చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. గ్రామంలో మద్యపాన నిషేధం చేస్తూ గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలని కోరారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-జైనూర్

ఏజెన్సీ మారుమూల ప్రాంతంలోని ప్రజలకు పోలీసు చట్టాలపై అవగాహన కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మెత విశ్వనాథ్ కోరారు. బుధవారం జైనూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన అంజయ్య కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో సేవలందించి ప్రజల గుండెల్లో నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ఉన్న యువతకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు తనవంతు కృషి చేయాలన్నారు. మూడు మండలాల్లో పోలీసులు మీకోసం ఆధ్వర్యంలో సేవలందించి ప్రజలకు విద్య, చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం దౌలత్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాము, యువ నాయకులు షేక్ ఆరిఫ్, ఆత్రం దత్తు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | ఫిబ్రవరి 08, 2024 | www.navatelangana.com

రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టిన సింగరేణి

• నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-జైపూర్



ఇందారం-రామారావుపేట్ మధ్య నిర్మించిన రోడ్డు మరమ్మత్తు పనులను సింగరేణి యాజమాన్యం చేపట్టింది. నిర్మాణం సరే నాణ్యతేది అనే శీర్షికన ఈ నెల 4న నవతెలంగాణ పత్రిక ప్రచురించిన వార్త కథనంతో యాజమాన్యం స్పందించింది. రూ. 2.8 కోట్లతో చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డులో పగుళ్ల కన్పిస్తుండగా సపోర్టుగా నిర్మించిన మట్టి రోడ్డు ఉర్రిపోతున్న తీరును వార్త కథనంలో వివరించడం జరిగింది. ఈ మేరకు సపోర్టు రోడ్డు పటిష్టపర్చడం కోసం అదనంగా మట్టి పోస్తూ సైడ్ రోడ్డును పటిష్టం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి

నవతెలంగాణ-జన్నారం



జనవరి 31న, మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగినా 100 మీటర్ల పరుగుపందెంలో మండల కేంద్రానికి చెందిన రాఘవేంద్ర లిటిల్ హాంస్ పాఠశాల విద్యార్థి యాసీన్ 7వ తరగతి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపిక అయినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాకేష్, సంజీవ్, రామారావు లు తెలియజేశారు. ఈ విద్యార్థిని పాఠశాల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ , కరస్పాండెంట్ ఎర్ర సంపత్ , పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ డీన్ హేమలత షిండే అభినందించారు.

కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-జన్నారం

మెరుగైన రవాణా సేవల కోసం కల్వర్టు నిర్మిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు పక్కన ఉన్న ప్రధాన రహదారిపై 3.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న, కల్వర్టు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిపై చిన్న కల్వర్టు ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందుకే కల్వర్ట్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, ఏనుగు సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళలు కుట్టు మిషన్ల పంపిణీ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని అంబేద్కర్ భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్ పాల్గొన్నారు.

సైన్స్ దినోత్సవం సందర్భంగా కవితల పోటీలు

నవతెలంగాణ-తాండూర్

భారీర సైన్స్ దినోత్సవం సంధిర్భంగా జడ్పీ హెచ్ఎస్ తాంగళ్ళ పల్లుల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వివిధ అంశాలపై (కవితలు, పాటలు, చిత్రలేఖనం, ఊపన్యాసం) పోటీలను నిర్వహించినట్టు హెచ్ఎం మల్లేశం తెలిపారు. ఈ పోటీలకు మండలంలో ఉన్నత పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రత్యేక పారిశుధ్యంపై గ్రామ సభలు

నవతెలంగాణ-వేమనపల్లి

వేమనపల్లి గ్రామ పంచాయతీలో బుదవారం ప్రత్యేక అధికారి ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య, నీల్వాయి గ్రామ పంచాయితీలో ఎంపీఓ శ్రీపతి బాపురావు అధ్యక్షతన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ నెల 7వ తేది నుంచి 15వ తేది వరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నీల్వాయి గ్రామసభకి జడ్పీసీఈఓ నరేందర్ హాజరై పరిశుధ్య అంశాలపై ప్రజలకి అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక అధికారులు గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని గ్రామ ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అవగాహన ర్యాలీ నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోలి స్వర్ణలత, ఏపీఎం ఉమారని, పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, అశోక్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రంగోలి కార్యక్రమం నిర్వహించి బహుమతులు ప్రదానం చేసారు.

యాదవ సంఘం యూత్ అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన ఏల్పుల అనిల్ కుమార్ యాదవ్ భారత యాదవ సమితి జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గొర్ర తిరుపతి యాదవ్‌లు అందించారు. యాదవులు ఏల్పుల అనిల్ కుమార్‌ను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏల్పుల అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు ఎస్ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని,యూత్ అధ్యక్షుడుగా నియమకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిలా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధినేని సతీష్, ఎలవేని గంగన్న, ముస్కె రవికిరణ్, రవీందర్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-తాండూర్

మధ్యాహ్న భోజన కార్మికులు ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు సంయుక్త కిసాన్ మోర్చా (రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక) సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయని అన్ని కార్మిక సంఘాల పాటతో పాటు సమ్మెలో పాల్గొననున్నట్లు వారు స్పష్టం చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సమ్మెలో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రెడ్డి మల్లతుడసం జంగు భాయ్, సీఐటీయూ నాయకులు రాజారాం పాల్గొన్నారు

ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీని సందర్శించిన ఆర్సీఓ

నవతెలంగాణ-హాజీపూర్



ముల్కల్ల సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలలో మంగళవారం పురుగుల అన్నం, నీళ్ళ చారు పెడుతున్నారని విద్యార్థులు, తల్లితండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో బుధవారం సాంఘీక సంక్షేమ గురుకులాల రీజనల్ కో ఆర్డినేటర్ స్వరూప రాణి సందర్శించారు. ప్రిన్సిపల్, సిబ్బందికి మోమోలు ఇచ్చి హెచ్చరించారు. ఆర్సీఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ముల్కల్ల సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థుల నాణ్యమైన విద్యా, భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, కార్యదర్శి మిట్టపల్లి తిరుపతిలు జిల్లా కేంద్రంలోని ఆర్సీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

నవతెలంగాణ-మందమర్రి



రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. బుధవారం మందమర్రి వృత్తి శిక్షణ కేంద్రంలో నిర్వహించిన రక్త దాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం మనోహర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అని అన్నారు. ఈ శిబిరంలో గనులు, డిపార్మెంట్లు, అప్రెంటీస్ కార్మికులతో రక్తదాన శిబిరం నిర్వహించామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల వారు రక్త నిల్వలు తగ్గాయన్న సూచన మేరకు తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని నిరుపేదలకు గర్భిణీ స్త్రీలకు కిడ్నీ డయాలసిస్ పేషెంట్ లకు అత్యవసర ఆపరేషన్లకు ఉచితంగా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు వారు అందిస్తారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు చేపడుతూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తలసేమియా వ్యాధి గ్రస్తులను ఆదుకుంటున్నామని వివరించారు. మందమర్రి ఎంవీటీవీసీ ద్వారా ఇప్పటివరకు 37 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బుధవారం నిర్వహించిన రక్త దాన శిబిరంలో 77 మంది రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సలేంద్ర సత్యనారాయణ ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్, రవీందర్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్, రమేష్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్, శంకర్ ఎంవిటిసి మేనేజర్, అశోక్ కుమార్ ట్రైనింగ్ ఆఫీసర్, కంకణాల భాస్కర్ రెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కాసర్ల శ్రీనివాస్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు, కాసర్ల రంజిత్ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, రఘువరుణ్ ఎంవీటీసీ ఓర్మెన్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 126 జయంతిని దళిత బహుజన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పాఠశాల పిల్లలకి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలిగిరి కనకరాజు, కనకం వెంకటేశ్వర్లు, దుర్గం గంగరాం, రేనికుంట్ల కుమార్, మల్లెత్తుల రాజేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అపరంజి, శ్రీధర్ పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని సంపుటం గ్రామంలో రమాబాయి అంబేడ్కర్ 12 వ జయంతిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్కే మోహన్ మాట్లాడుతూ రమాబాయి రత్నగిరి జిల్లాలో సైనిక కుటుంబంలో జన్మించింది. తొమ్మిదో యాట అంబేద్కర్‌తో వివాహం జరిగింది. ఐదుగురు పిల్లలతో రమాబాయి ఎన్ని కష్టాలు వచ్చినా బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఇబ్బందులు కలగకుండా తన మనసులోనే దాచుకొని నవ్వుతూ సేవలు అందించేదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ వేమనపల్లి మండల కన్వీనర్ కామెర సంజీవ్, రాజమల్లు శంకర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేమనపల్లిలో..

గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గ్రామ పంచాయతీల వారిగా పారిశుధ్య పనులు ప్రారంభించినట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా పారిశుధ్య పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిరవధికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. టేకుమట్ల గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ సత్యనారాయణను గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ గోనె సుమలత నర్సయ్యలను శాలువాతో సన్మానించారు.

గ్రామస్తులతో కలిసి సమస్యల గుర్తింపు

గ్రామ పంచాయతి పరిధి ప్రజా ప్రతినిదులతో పాటు గ్రామస్థులతో కలిసి పంచాయతి పరిధిలో గల సమస్యలు, పనులను గుర్తించామని భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. నర్సింగాపూర్ ప్రత్యేక అధికారిగా బుధవారం గ్రామస్థులతో సమావేశమైన ఆయన గ్రామస్థులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సంధర్భంగా పారిశుధ్య పనుల నిర్వాహణ, నర్సరీల నిర్వాహణ తీరును పరిశీలించారు. మండల పరిధిలో ప్రత్యేక అధికారులుగా నియమితులైన అధికారులు ఈ నెల 15 వరకు కొనసాగనున్న రోజు వారి పనుల నిర్వాహణపై గ్రామస్థులకు వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కవ్వాల్ టైగర్ జోన్ సంరక్షణపై సమీక్ష

నవతెలంగాణ-జన్నారం



ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల, వన్యప్రాణులు సంరక్షణ సాధ్యమని జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశీస్ సింగ్ అన్నారు. కవ్వాల పులుల అభయారణ్యం జన్నారం నర్సరీలోని టీడీసీ, కమ్యూనిటీ హాల్లో బుధవారం బాసర, కాళేశ్వరం జోన్‌ల అటవీ అధికార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అభయారణ్యంలోని అడవుల, వన్యప్రాణులను కాపాడుకోవడానికి ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలను స్వీకరించాలని ఆయన చెప్పారు. ఉన్న అడవులను కాపాడుకోవడానికి చేపట్టబోయే పలు పనులను ఆయన వివరించారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో బాసర కాళేశ్వరం జోన్లకు సంబంధించిన అటవీ అధికారులు నాలుగు రోజులు అడవులలో పర్యటించి ఎలాంటి అభివద్ధి పనులు చేయాలి. ఇప్పుడు చేసిన పనులపై వివరాలు సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్ కొమరంభీ ఆసిఫాబాద్, మంచిర్యాల డీఎస్ఓలు, ఎఫ్డిఓలు, రేంజ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్, బిట్ ఆఫీసర్లు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్సి యోగేష్, చీఫ్ వైల్డ్ లైఫ్ వాడెన్, అరుణాచంద్రప్రకాష్, అశోక్ కుమార్, కిషన్ యాదవ్, వినయ్ కుమార్ సాహు, హాఫీజోద్దీన్, నాగవత్ స్వామి, గులాబ్ మొయినోద్దీన్, హేమలత, శంకర్, జ్ఞానేశ్వర్, తిరుపతి పాల్గొన్నారు..

విపత్తు సమయంలో అప్రమత్తం

నవతెలంగాణ-జన్నారం

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తతో వ్యవహరించాలని ఎన్డీఆర్ఎఫ్ అధికారులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు వివిధ ప్రకృతి వైపరీత్యాల గురించి విద్యార్థులకు వివరించారు. సీపీఆర్, వరదలు వచ్చిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ బెటాస్ సింగ్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, గోవిందా రావు, తాసిల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ బాను చందర్ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పుస్తకాలు

నవతెలంగాణ-మందమర్రి

కెకెఓసిపి బ్లాస్టింగ్ సెక్షన్ లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆకస్మిక ప్రమాదాలకు అనారోగ్యాలకి గురి అయినప్పుడు సింగరేణిలో వైద్య సౌకర్యం కోసం కాంట్రాక్టు ఉద్యోగులకు బుధవారం కెకె ఓసీపీ పీఓ రమేష్, మేనేజర్ వీరయ్య కార్మికులకు వైద్య పుస్తకాలను అందజేశారు. వాటిని సక్రమంగా వినియోగించుకుని ఈ అవకాశాన్ని సంబంధిత ఉద్యోగులు వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎస్ఓ కుశ్వా, పిట్ సెక్రెటరీ మర్రి కుమార స్వామి, బ్లాస్టింగ్ ఇంచార్జి రమేష్, డబ్ల్యూ సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జి గోపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో గత సంవత్సరం నుంచి ఎస్ఆర్ స్కూల్ పేరు మీద శ్రీ చైతన్య పాఠశాల నిర్వహిస్తూ బెల్లంపల్లి ప్రాంత విద్యార్థులని, విద్యార్థి తల్లిదండ్రులని మోసం చేస్తున్నారన్నారు. విద్యార్థులని తీసుకురావడం కోసం పంపే బస్సులపైన, విద్యార్థుల బెల్టుల పైన, పుస్తకాల పైన, నిర్వహించే పరీక్ష పత్రాల పైన, కరపత్రాల పైన శ్రీ చైతన్య స్కూల్ అనే ఉండడం జరుగుతుందని, కానీ బెల్లంపల్లిలో శ్రీ చైతన్య పాఠశాలకు ఎలాంటి పర్మిషన్ లేదన్నారు. గతంలో అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి శ్రీ చైతన్య పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ తిరిగిన తహసీల్దార్



నవతెలంగాణ-హాజీపూర్

గ్రామాల్లో ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా హాజీపూర్ తహసీల్దార్ సతీష్ కుమార్ హాజీపూర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్రామంలో ప్రజలసమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మురికి కాలువలు, రోడ్లు ప్రతి రోజూ శుభ్రం చేయాలని, ఇండ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్త పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. మురిగి కుపాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ సోగాల సుజాత, రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

ఓపెన్ టూ ఆల్ చదరంగం పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మందమర్రి లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలను ఫిబ్రవరి 11తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ ఉపాధ్యక్షులు ఎండి సిరాజ్ ఉర్ రెహ్మాన్ బుధవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. విజేతకి రూ.5000, స్విస్ లీగ్ పద్ధతిలో జరుగు ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు అండర్-9,11,13,15 గ్రూపులలో బాల బాలికలకు ప్రోత్సాహ బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రతి నెల చివరి ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన ఆటను అలవర్చుకునే విధంగా టోర్నమెంట్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీ సీనియర్లకి రూ.150, జూనియర్స్ కి రూ.100 పూర్తి వివరాలకు చీఫ్ అర్బుయిటర్ కల్పన 9030885774, 8978146456 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉత్పత్తే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఉపరితల గనిలో ఉత్పత్తి ఉత్పాదకత పెంచేందుకు గానూ మల్టీ డిపార్మెంటల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గనులలో ఉత్పత్తి ఉత్పాదకత పెంచి, లక్ష్యాలని అధిగమించడం, నాణ్యత ప్రమాణాల పెంపు, సంక్షేమం అంశాలపైన ప్రణాలికలను రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. కంపెనీ ముందున్న సవాళ్ళను క్షుణ్ణంగా కార్మికులకు వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్టీ డిపార్మెంటల్ టీం కన్వీనర్, ఎస్ఓ టు జీఎం రఘుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి వి.పురుషోత్తంరెడ్డి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ కాలరీ మేనేజరు సుధీర్ జక్కులవార్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో సమస్యల వెల్లువ

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ మండలంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభల్లో సమస్యలు వెల్లువెత్తాయి. బోయపల్లిలో ప్రత్యేక గ్రామసభ అనంతరం గ్రామపంచాయతీ పారిశుధ్య పనులను నిర్వాహణపై స్థానికులు ప్రత్యేక అధిఆరి కిరణ్మయి దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ కాలనీలో నూతనంగా డ్రైనేజీని నిర్మించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ఏఓ కిరణ్మయిని కోరారు. నర్సాపూర్ పంచాయతీలో వెటర్నరీ డాక్టర్ భూమన్న గ్రామ సభ నిర్వహించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక గ్రామ సభ సందర్భంగా పంచాయతీలు ముగ్గుల పోటీలను నిర్వహించారు. తాండూర్ మేజర్ పంచాయతీలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ గ్రామసభ నిర్వహించి మిషన్ భగీరథ మంచినీటి సరఫరా పారిశుధ్య నిర్వహణ డంపింగ్ యార్డ్ సెగ్రికేషన్స్ షెడ్యూల్ నిర్వహణపై ప్రజలకు మల్టీపర్పస్ వర్కర్లకు అవగాహన కల్పించారు. దారకపూర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ గ్రామసభ నిర్వహించి శ్రమదానం పారిశుధ్య పనుల నిర్వహణ మొక్కల సంరక్షణపై ప్రజల భాగస్వామ్యాన్ని ప్రజలకు వివరించారు.

సేవలోనే నిజమైన సంతృప్తి

నవతెలంగాణ-దహెగాం

ప్రజాసేవలో నిజమైన సంతృప్తి లభిస్తుందని పుప్పాల మల్లక్క ట్రస్టు చైర్మన్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బీబ్రా గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు, విద్యార్థులకు సేవ చేయాలనే తపనతోనే ట్రస్టు పనిచేస్తుందన్నారు. పాఠశాలకు సంబంధించిన ఎలాంటి సహాయం అందించడానికి కూడా ట్రస్టు ముందుంటుందని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ బండ కృష్ణమూర్తి మాట్లాడుతూ గతంలో కూడా ట్రస్టు ద్వారా బీబ్రా పాఠశాల విద్యార్థులకు ట్రై, బెల్టులు, పెన్నులు, పుస్తకాలు అందించామని గుర్తు చేశారు. పేద ప్రజలను గుర్తించి సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, నాయకులు నాయికిని లక్ష్మణ్, రౌతు విఘ్నేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడుంబా రహిత గ్రామాలుగా మారాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రామాలు గుడుంబా రహిత గ్రామాలుగా మారాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా 10 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులను అందించారు. గ్రామాల్లో గుడుంబా, పేకాట, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. యువత ఆయా రంగాల్లో రాణించేల పోలీసుల తరపున సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలను కొనసాగిస్తే చట్ట పరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నిర్వహిస్తున్నామని అదే విధంగా గ్రామస్తులు తమకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొమురయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికలు, మహిళల భద్రతే షీటీం లక్ష్యం



నవతెలంగాణ-వాంకిడి

బాలికలు, మహిళల భద్రతే షీటీం లక్ష్యమని వాంకిడి సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బెండారా డిగ్రీ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, బయట ఎక్కడైనా ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసిన, వేధించిన, అసభ్యకరంగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా షీటీం నెంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చిన్నచిన్న విషయాలపై ఆవేధనకు గురికావొద్దని, మంచి ఆలోచనలతో కష్టపడి ఇష్టపడి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యాసంస్థలు, పాఠశాలలు, గురుకులాలు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్యాంకు ఖాతా నుండి డబ్బులు పోతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేస్తే సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, అధ్యాపకులు, షీటీం ఇన్‌చార్జి సునీత, సభ్యులు శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-కౌటాల

గ్రామంతో పాటు పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఓ సురేందర్ సూచించారు. మండలకేంద్రంలో బుధవారం ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్‌తో కలిసి పంచాయతీ కార్యాలయం నుండి జెడ్పీహెచ్ఎస్, బస్టాండు ప్రధాన రోడ్లను ఆయన పరిశీలించారు. మురికి నీరు నిల్వకుండా చూడాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలో విడతల వారీగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని, దీని కోసం వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ మౌనిక, ఎంపీటీసీ బసార్కర్ శిరీష, మాజీ సర్పంచ్ మౌనీష్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ కోఆప్షన్ సభ్యుడు నహీంహైమద్, బీఆర్ఎస్ నాయకులు డబ్బ బాపు, తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, బాబురావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముసుగులో ప్రభుత్వ భూమి కబ్జా

నవతెలంగాణ-రెబ్బెన

రాజకీయ ముసుగులో మండలంలోని బీఆర్ఎస్ నాయకుడు మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై గల ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్ రమేష్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలకేంద్రంలోని జాతీయ రహదారి ప్రక్కన గల 342 సర్వే నెంబర్ గంగాపూర్ శివారులోని కనీస విలువ రూ.20 నుండి 30 లక్షల విలువ గల ప్రభుత్వ భూమిని గంగాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పందిర్ల వినోద భర్త పందిర్ల మధునయ్య కబ్జా చేయాలని చూస్తున్నాడన్నారు. 2019లో సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత ఆమె భర్త మధునయ్య బీఆర్ఎస్ పార్టీలో క్రియశీలక పాత్ర పోషిస్తూ అధికార పార్టీ అండదండలతో అదే గ్రామ శివారులో గల జాతీయ రహదారి ప్రక్కన గల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఆరోపించారు. ప్రస్తుతం తాత్కాలిక ప్రెస్‌క్లబ్ ప్రక్కనున్న భూమిని కబ్జా చేయడం కోసం ప్రయత్నిస్తున్నారని, వెంటనే సంబంధిత అధికారులు పట్టించుకొని మధునయ్యకు ఇచ్చిన డూప్లికేట్ ప్రొసిడింగ్ కాపీని రద్దు చేసి వెంటనే అర్హులైన జర్నలిస్టులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, గంగాపూర్ మాజీ సర్పంచ్ ఎల్ గట్టుమేర, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, వంకులం మాజీ సర్పంచ్ ప్రేమ్‌దాస్, చల్లూరి గంగయ్య, సంతోష్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

11న గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ పోలోజు బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఆసిఫాబాద్‌లో ఐదు, సిర్పూర్‌లో మూడు, రెబ్బెనలో ఒకటి పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. ఈ తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2782 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థిని, విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తమవెంట తీసుకురావాలన్నారు.

బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-బేల

సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండిస్తు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ పదవీ పోయిన బాల్క సుమన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. వెంటనే సీఎంకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ మార్కెట్ చైర్మెన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, నాయకులు ఘన్‌శ్యాం, మడావి చంద్రకాంత్, సుధాంరెడ్డి, అడే శంకర్, కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి, గోడే అవినాష్ శంకర్ భోక్రే, విపిన్ రాక్రే , రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.

త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కళ్యాణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-కడెం

పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఒక వరమని, త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 52 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్లు ఉచిత కరెంట్ త్వరలోనే ప్రభుత్వం ఇవ్వబోతుందని తెలిపారు. అనంతరం కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ కళాశాలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ, కళాశాలకు సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, అంబారిపేట్ ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి తక్కల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రహీం, బబ్లు, కడెం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టుగూళ్ల కాయలను వేలం వేసిన అధికారులు



పుట్టగూళ్లకు వేలంలో అధికారులు, రైతులు, వ్యాపారులు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తలోడి పట్టు పరిశ్రమ పరిధిలో రైతులు పండించిన పట్టుగూళ్ల కాయలను బుధవారం అధికారులు వేలం వేశారు. ఖర్జెల్లి రేంజ్ అటవీ ప్రాంతంలోని అంబగట్ట, కాటెపల్లి, ముంజంపెల్లి గ్రామాల రైతులు అటవీ ప్రాంతంలోని నల్లమద్ది చెట్లపై ఈ పట్టుగూళ్లను పెంచినట్టు వరంగల్ జేడీఎస్ ఈ.అనసూయ తెలిపారు. మొత్తం 182 మంది రైతులు కలిసి10.62 లక్షల పట్టుగూళ్లను పండించినట్టు ఆమె తెలిపారు. గత సంవత్సరం ఐదు లక్షల గూళ్లను పండించగా ఈ ఏడాది సాగు రెట్టింపు అయిందన్నారు. రైతుల్లో పట్టుసాగు అవగాహన పెంచడంలో అధికారులు విజయం సాధించినట్టు, అధికారులను, రైతులను ఆమె అభినందించారు. ఈ ఏడాది వేలం పాటలో ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హాకింపేట, పోతురెడ్డిపల్లి కోఆపరేటివ్‌కు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నట్టు, వెయ్యి గూళ్లకు గాను రూ.5100కు వేలం పాటలో వ్యాపారులు పట్టుగూళ్లను కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆసక్తి గల రైతులకు ఈ పట్టుసాగుపై అవగాహన కల్పించి వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఈ వేలం పాటలో బీహెచ్ఓ ఆసిఫాబాద్ ఎం వెంకటేశం, చెన్నూరు శాస్త్రవేత్త ఎన్‌వీ భగవాన్, చెన్నూరు ఏడీ డీఈ దయాకర్, చెన్నూరు సెరికల్చర్ ఏడీ పార్వతి, కాగజ్‌నగర్ ఆర్టికల్చర్ అధికారిని ఏజె శాంతిప్రియ, వెంకన్న, సెరికల్చర్ అధికారి ఎండీ బయోద్దీన్, టీఏలు సోము, శంకర్, నర్సయ్య, వ్యాపారులు, రైతులు ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకులకు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ బహిరంగ సభను కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె దృష్ట్యా కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను దిక్కరిస్తుందని, దీనికి వ్యతిరేకంగా సమ్మెను చేస్తున్నట్టు, దీనిలో భాగంగానే ఈ నెల 11వ తేదీన కాగజ్‌నగర్‌లో ఎస్‌బీఐ బ్యాంకులో బహిరంగ సభను ఏర్పాటుచేస్తున్నామన్నారు. సభకు ముఖ్య అతిథిగా సీఐటీయూ ఆలిండియా కోశాధికారి సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మధు, మధ్యాహ్నభోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమా హాజరవుతున్నారన్నారు. జిల్లాలో ఉన్న వివిధ స్కీం వర్కర్లు హాజరై ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట హాస్టల్ డేలీవేజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్యామల, జిల్లా నాయకులు పద్మ, సువర్ణ, మారుతి, దుర్గమ్మ, జ్యోతి ఉన్నారు.

నియామకాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పారామెడికల్ సిబ్బంది నియామకాలు మళ్లీ చేపట్టి స్థానికులకు అవకాశం కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య శాఖలో పారామెడికల్ సిబ్బంది, డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ లాంటి కాంట్రాక్టు పోస్టులకు జనవరిలో నోటిఫికేషన్ విడుదలైందన్నారు. స్థానిక అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని వారి పేర్లు మెరిట్ లిస్ట్‌లో ఉన్నప్పటికీ వారిని నియమించలేదన్నారు. వారి స్థానంలో ఇతర జిల్లాల వారిని నియమించారని తెలిపారు. మెరిట్ జాబితాలో నాలుగో ర్యాంకులో ఉన్న విద్యార్థికి నాలుగు విభాగాల్లో కూడా పోస్ట్ రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే దానిని సవరించి స్థానికులకు అవకాశం కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసి జిల్లా కన్వీనర్ కొన్న రమేష్, నిరుద్యోగ అభ్యర్థులు సరోజ, మౌనిక, మహేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.

కష్టపడి చదివతే మంచి భవిష్యత్తు

నవతెలంగాణ-తాంసి

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని కస్తూర్బా గాంధీ వసతి గృహం సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ విద్యార్థులకు సూచించారు. బుదవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ముందుగా సరస్వతి చిత్రపటానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులను సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వసతులు కల్పించి విద్యాబోధనను అందిస్తుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు నెల రోజులు బాగా కష్టపడి చదువుకోని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీకాంత్, అబ్దుల్, పాఠశాల ఇన్‌చార్జి ఎస్ఓ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.



పదో తరగతిలో అత్యుత్తమ ఫలితలు సాదించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలపై మార్గనిర్దేశం చేస్తూ, పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే నిరంతరం శ్రమించాలని తెలిపారు. ప్రపంచం విజేతలనే గుర్తిస్తుందని, పాఠశాల స్థాయి నుంచే శ్రమించే స్వభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షలకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి నవిత, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎమ్మెల్యే పటేల్



నవతెలంగాణ-భైంసా

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఢిల్లీలో బుధవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కలిశారు. జాతీయ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర మంత్రిని శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకునికి పీహెచ్‌డీ పట్టా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగంలో ఆంగ్ల సీనియర్ అధ్యాపకునిగా పనిచేస్తున్న చింతకుంట్ల నర్సయ్య ఆంగ్లంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. రచయిత దేవదత్ పట్నాయక్ ఎంపిక చేసిన నవలలలో భారతీయ జీవితానికి సంబంధించిన పౌరాణిక వివరణలు" అనే అంశంపై చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ, హైదరాబాద్ ఆంగ్ల విభాగ ప్రొఫెసర్ జి. దామోదర్ పర్యవేక్షణలో మూడున్నర సంవత్సరాల పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించి ఉత్తీర్ణులయ్యారు. కాగా ఈ పట్టాను చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ నుండి ఆయన సాధించారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ పి.భరద్వాజ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాల అధిపతులు రాజ్ కుమార్, వీరస్వామి, రాజన్న, సుజయ్, అనిల్ కుమార్ చౌహన్, పరిపాలన అధికారి రాజేష్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మానవ సేవే మాధవ సేవ సభ్యుల ఆర్థిక సాయం

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గుండ లత కుటుంబ సభ్యులకు బుధవారం మానవ సేవే మాధవ సేవ గ్రూప్ ఫౌండర్, యువజన కాంగ్రెస్ నాయకులు శెట్‌పెల్లి మహేందర్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.6200 ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో రూ.5వేలు మహేందర్, మిగతా గ్రూపు సభ్యులు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్, ప్రశాంత్, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

10న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ -ముధోల్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మండలంలోని ఎడ్‌బిడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ ఎపిక పోటీలు జరగనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో ఎంపికైన వారు ఈ నెల 16 నుండి 19 తేదీలలో సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, బోనాఫైడ్‌తో పాటు రూ.100 ఇంట్రి ఫీజుతో పిఈటిలు శ్రీధర్‌రెడ్డి, సునిల్‌కు రిపోర్టు చేయాలని టీం నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రేమలత తెలిపారు.

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని విద్యానగర్ కాలనీలో బుధవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజురా సత్యం, నాయకులు, కురుమ సంఘం సభ్యులు ఏనుగుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

10న పూర్వ విద్యార్థుల సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న మధ్యాహ్నం మూడు గంటలకు పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, పూర్వ విద్యార్థుల సంఘం సమన్వయకర్త ప్రతాప్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఏ.వెంకటి ఇతర సభ్యులు పాల్గొని కళాశాల అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. బుధవారం సాయిరాం నగర్, లక్కారాం, సుద్దగుడా, కల్లూరుగూడా, ఘన్‌పూర్ గ్రామాల్లో పర్యటించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యాలు కల్పించేల తన వంతు కృషి చేస్తానని అన్నారు. సమస్యలు ఏమైన ఉంటే తనకు నేరుగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమల, నాయకులు పాల్గొన్నారు.